

# బహుమతి

**తిరుమలపెద్దింటి గోపాల్**

జానకికి ఏం చెయ్యాలో తోచడం లేదు. అసలే నెలా ఖరు రోజులు. ఏది కొన డానికైనా చేతిలో డబ్బు ల్లేవు.

వట్టి చేతులతో వెడితే బాగుం డదు.

ఎంత చిన్న బహుమతి కొన డానికైనా చేతిలో డబ్బులాడడం లేదు. జానకి అప్పుడనుకుంది - ఈ బహుమతులివ్వడం ఎవరు మొదలెట్టారోకాని వాళ్ళని మెషిన్ గన్‌తో శరీరం తూట్లుపడేలా కాల్చినా పాపంలేదని.

జానకి ఆ వారంలో స్నేహితురాలి కూతురి పెళ్ళికి వెళ్ళాలి. వెడుతూ ఏదైనా బహుమతి కొని తీసుకెళ్ళాలి. బ్యాంకు పుస్తకం తెరిచి చూసింది. బ్యాలన్స్ ఇరవై రూపాయిల అరవై పైసలు కంటే లేవు. కనీసం ఇరవై రూపాయిలైనా 'బ్యాలన్స్' వుండకపోతే బాగుండదు. అంటే బ్యాంక్ నుంచి డబ్బు తియ్య డానికి అవకాశం లేదన్న మాటే!

కనీసం పాతిక రూపాయిలుంటేగాని బహుమతి ఇవ్వలేం. కానీ పాతిక రూపాయిలెలా వస్తాయి? క్యాంపుకెడుతూ ఇంటి ఖర్చులకని భర్త ఇచ్చిన యాభై రూపాయిలూ హారతి కర్పూరంలా ఆ పర్నాటికే ఆరిపోయాయి. తనింట్లో వస్తువులన్నిటినీ పరిశీలనగా చూసింది- ఏదైనా బహుమతిగా ఇవ్వడానికి బాగుం టుందేమోనని. కానీ, ఆమె దృష్టిని ఏ వస్తువూ ఆకర్షించలేదు. అన్నీ పాతవే. తన మీద తనకే కోపమొచ్చింది జానకికి. ఇంటి పనులు చేస్తోందన్న మాటేకానీ, మనసంతా బహుమతి మీదే వుండి పోయింది.

ఏం కొని తీసుకెళ్ళాలి? ఎంతలో కొనుక్కోవాలి? ఎంతలోనయినా ఎలా తీసు కొనేది? తీసుకుపోకుండా ఎలా వెళ్ళేది? వెళ్ళకుండా ఎలా వుండేది?

ఆ ... అప్పుడు తోచిందామెకా లోచన! పక్కింటి మాధవిని అడిగి డబ్బులు అప్పు తీసుకొంటే! గబగబా ఇంటి పనులు ముగించుకుని పక్కింటికి వెళ్ళింది.

మాధవి జానకిని ఆహ్వానిస్తూ కుర్చీ చూపించింది.

"పనులైపోయాయా?"

జానకి ముభావంగా సమాధానం చెప్పింది. ఆమెకి డబ్బులు ఎలా అడగాలో తోచడంలేదు.

"ఇంకేంటి సంగతులు ... మీవా రెప్పుడొస్తారు?"

"ఇంకో వారం రోజులు పట్టొచ్చు." చివరికి ధైర్యంచేసి అడిగింది- "నువ్వు నాకోసహాయం చెయ్యాలి. ఏమను కోకు."

"అబ్బే ... అదేం లేదు, ఏం కావాలి ... అడుగు"

"నేను ఈ వారంలో స్నేహితు రాలింట్లో పెళ్ళికెళ్ళాలి. ఆయన క్యాంప్ కెడుతూ నా చేతికిచ్చిన డబ్బులు అయి పోయాయి. అందుకని ఏమీ అనుకోక పోతే ఓ యాభై రూపాయిలిస్తే ఆయన రాగానే అడిగి ఇచ్చేస్తాను" చెప్పింది జానకి సిగ్గుపడుతూ, ఆగి ఆగి!

"ఓస్ ... అంతేనా ... ఇంతోటి దానికే అంత సిగ్గెందుకూ ... ఇరుగు పొరుగన్న తర్వాత. ఆపాటి అవసరాలకి ఆదుకోకపోతే ఇంకెందుకు?" అంటూ ఆమె డబ్బు తెచ్చి జానకికిచ్చింది.

మాధవికి ఒకటికి పదిసార్లు థాంక్స్ చెప్పి ఇంటికెళ్ళింది జానకి.

సాయంత్రం షాపింగ్‌కెళ్ళే వరకూ ఏం బహుమతి కొనాలా అని ఆలోచి స్తూనే వుండిపోయింది.

సాయంత్రం మార్కెట్‌కెళ్ళి మంచి ఆర్టికల్ కొని 'ప్యాక్' చేయించింది.

ఇప్పుడు ఆమెకి చెప్పలేనంత ఆనం దంగా వుంది - అంత మంచి ఆర్టికల్ కొన్నందుకు!

*　　*　　*

పెళ్ళికి వెళ్ళిన జానకిని చూసి ఆనం దంతో ఎగిరి గెంతేసింది స్నేహితురాలు.

"రావేమోననుకున్నానే ... చాలా థాంక్స్ వచ్చినందుకు" స్నేహితురాలు అనందంతో ఉక్కిరిబిక్కిరైపోయింది.

జానకికి కావలసినవన్నీ దగ్గరుండి అమర్చింది.

పెళ్ళికి రెండు గంటల ముందువరకూ ఆమె వంటిపెట్టుకునే వుంది స్నేహితు రాలు, కూతురి పెళ్ళైనా సరే!

జానకికి స్నేహితురాలితో గడిపినం దుకు చాలా సంతోషం కలిగింది.

అనుకున్నట్టే చక్కగా పెళ్ళయి పోయింది.

కానుకలు చదివించే సమయంలో జానకి తాను తెచ్చిన ఆర్టికల్ స్నేహితు రాలి చేతికందించబోయింది.

"అక్కడివ్వవే" అంటూ ఎక్క డివ్వాలో చూపించింది. బహుమతి విషయం పెద్దగా పట్టించుకోలేదు.


ప్యాకెట్ తీసుకెళ్ళి అక్కడిచ్చింది. అతను అది తీసుకుని పెద్ద గోనెలో మిగిలిన బహుమతులతోబాటు పడేశాడు! ●

## మందుకి కూడా మామిడి చెట్టు

మామిడిచెట్టు మందుకేం పనికి వస్తుంది. ఏదో కాయలు పచ్చళ్ళకూ, ఊర గాయలకూ, పండ్లు తినడానికే తప్ప అని అనుకోవచ్చు కానీ మామిడిచెట్టు యొక్క చిగుళ్ళు, ఆకులు, పూలు, పిందెలు, కాయలు, పండ్లు టెంకలోని పప్పు, మామిడి చెట్టు పట్ట, వేరు ఇవన్నీ కూడా మందుగా ఉపయోగపడేవే అంటే అతి శయోక్తి గాదు.

మామిడి చిగుళ్ళు-ఆహారంలో రుచిని కలి గిస్తాయి. కఫపిత్తాలను హరిస్తాయి. మామిడి పూలు- విరేచనాలు, కఫం, పిత్తం బహు మూత్రం, స్త్రీలకేర్పడే రక్తస్రావం దీనిని పోగొడుతాయి. బలం చేస్తాయి. ఆహారంలో రుచిని కలిగిస్తాయి.

మామిడి పిందె- ఆహారంలో రుచిని కలిగి స్తుంది. మామిడి పండు- శుక్రవృద్ధి చేస్తుంది. శరీరానికి మనుపుదనాన్ని కలిగి స్తుంది. బలాన్నీ, సుఖాన్నీ ఇస్తుంది. హృద యానికి మేలు చేస్తుంది. శరీరానికి మంచి వర్ఛస్సిస్తుంది. బలం చేస్తుంది. ఆకలిని పుట్టి స్తుంది. మామిడి తాండ్ర రుచిని కలిగి స్తుంది. దప్పిక, వాంతులను హరిస్తుంది. మామిడి టెంకలోని పప్పు- వాంతులు, విరే చనాలు, గుండెలో మంటలను పోగొడు



తుందని భావ ప్రకాశంలో చెప్పబడింది. మామిడి పండులో ఎ.బి.సి.డి. విటమిను లున్నట్టు కూడా గుర్తింపబడింది.

మామిడి చెట్టు యొక్క ప ట్ట, వేరు, చిగుళ్ళు- ఇవి వగరుగా వుండి విరేచనాలను తగ్గిస్తాయనీ, కఫపిత్తాలను హరిస్తాయనీ ధన్వంతరి నిఘంటువులో తెలుపబడింది. మామిడి చెట్టు లోపలి పట్ట-రుచిని గూడా కలిగిస్తుందనీ, పూలు- జఠరాగ్నిని గూడా వృద్ధి జేస్తుందనీ "రాజనిఘం టువు"లో నిర్దేశించబడింది.

మామిడాకుల రసాన్ని ఇస్తే వాంతులు నిలుస్తాయి. మామిడి కాయను పచ్చడిచేసి మితంగా వాడితే ఆహారంలో రుచికలుగు తుంది. జఠరాగ్ని వృద్ధి చెందుతుంది.

మామిడి పిందె చూర్ణాన్ని తేనెతో కలి పిస్తే పిల్లలకు విరేచనాలు తగ్గుతాయి. మామిడి పూల రసాన్ని ముక్కులో పోస్తే ముక్కు నుంచి రక్తం కారడం ఆగుతుందనీ, మామిడిచిగుళ్ళ రసాన్ని - తేనె, నెయ్యి, పాలు వీటిలో గలిపి వాడితే రక్త విరేచనాలు తగ్గు తాయనీ అష్టాంగ హృదయంలో చెప్ప బడింది.

మామిడిటెంకలోని పప్పును నూరి కొన్నాళ్ళు సేవిస్తే కడుపులో క్రిములు నశి స్తాయి. స్త్రీలకేర్పడే ఎర్రబట్ట, తెల్లబట్ట తగ్గు తుంది. మూత్రసంబంధ రోగాలు తగ్గుతాయి. మామిడి పట్ట, ఆకులు, పూలు, పప్పు వీని చూర్ణాన్ని వ్రణాల మీద చల్లితే రక్తస్రావం తగ్గి అవి త్వరగా మానిపోతాయి.

— ఆయుర్వేద శిరోమణి
రాజరాజేశ్వర శర్మ

7-4-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక